ప్రజాశక్తి
బుధవారం 30 జూలై 2025
5
శ్రీకాకుళం



ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ఒడిశాకు విద్యార్థులకు ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేందుకు మండలంలోని రాగోలులో గల బొల్లినేని మెడ్‌స్కిల్స్‌తో ఎంఒయు కుదుర్చుకున్నట్లు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా డిఎస్‌డిఇఒ సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలిపారు. ఎంఒయు ఒప్పందం పత్రాలను అందుకున్న అనంతరం మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్‌యుఎ ఒడిశా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా 240 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో శిక్షణ అందించనున్నామని తెలిపారు. శిక్షణతో పాటు ఉచితంగా భోజన వసతి సదుపాయాలు, యూనిఫామ్ స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, గజపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పచ్చని భూముల్లో ఎయిర్‌పోర్టు చిచ్చు

- మందసలో కార్గో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు
- బలవంతపు భూసేకరణకు యత్నం
- పలుమార్లు అడ్డుకున్న రైతులు, స్థానిక ప్రజలు
- ప్రతిపాదిత గ్రామాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేడు పర్యటన

ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రభుత్వం మరో చిచ్చు పెట్టేందుకు సిద్ధమవుతోంది. గతంలో సోంపేటలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బలవంతంగా భూములు సేకరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు, రైతులు, మత్స్యకారులు తిరగబడ్డారు. వారిపై కాల్పులకు సైతం తెగబడి ముగ్గురిని పొట్టన పెట్టుకుంది. ఇప్పుడు అదే ప్రాంతానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తోంది. దీన్ని రైతులు, స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పలురూపాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి పోరాటానికి అండగా నిలిచేందుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రతిపాదిత గ్రామాల్లో పర్యటించనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రాంతం వ్యూ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతేడాది అక్టోబర్ 31వ తేదీన ఇచ్ఛాపురం మండలం ఈదుపురం సభలో ప్రకటనతో కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలు మొదలయ్యాయి. టెక్కలి, పలాస మధ్య నిర్మిస్తామంటూ అదే సభలో ప్రకటించారు. టెక్కలిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే స్థానికంగా వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో దాన్ని పలాస నియోజకవర్గానికి మార్చినట్టు గతంలో జోరుగా ప్రచారం సాగింది. దీంతో మందస ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మందసలోని లక్ష్మీపురం, భేతాళపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని ఎనిమిది గ్రామాలు, వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు, చీపురుపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని మరో ఎనిమిది మొత్తం 16 గ్రామాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రాథమికంగా ప్రతిపాదనలు చేశారు. మొత్తం 1383.25 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. మూలపేటలో పది వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామంటూ అదే సభలో ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు, బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్, సరుకు రవాణా కోసమే ఎయిర్‌పోర్టు (కార్గో) నిర్మిస్తున్నారన్న చర్చ ప్రజల్లో విస్తృతంగా వెళ్లడంతో తీవ్ర వ్యతిరేత మొదలైంది. పలురూపాల్లో ఆందోళనలు సాగించారు.



కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రాంతం మ్యాపు

బలవంతంగా భూసేకరణకు యత్నం

కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఆయా గ్రామాల ప్రజలకు కనీసం మాట మాత్రంగానైనా చెప్పలేదు. గ్రామసభల నిర్వహణ, ప్రజాభిప్రాయ సేకరణ వంటి పద్ధతులను అనుసరించకుండా నేరుగా భూసార పరీక్షలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. భూసార పరీక్షల కోసం గ్రామాల్లోకి వచ్చిన సిబ్బందిని ఇప్పటికే రెండుసార్లు రైతులు, స్థానిక ప్రజలు అడ్డుకున్నారు.

అభివృద్ధి అంటూ ప్రచారం

మందసలో ఎయిర్‌పోర్టు వస్తే అభివృద్ధి జరిగిపోతుందంటూ ప్రజల్లో భ్రమలు కల్పించేలా టిడిపి నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు అభివృద్ధి భ్రమలు కల్పిస్తున్నారు. ఉద్యోగాలు వస్తాయంటూ చెప్తున్నారు. భావనపాడు పోర్టు వద్దని చెప్పడం వల్లే అది మూలపేటకు వెళ్లిపోయిందని, ఇప్పుడు ఉద్యోగాలు కావాలంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మూలపేట పోర్టులో కూలి పనులనే ఉద్యోగాలుగా వారిలో భ్రమలు కల్పించే పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే శిరీష మరో అడుగు ముందుకేసి ఎవరు అడ్డుకున్నా ఎయిర్‌పోర్టు కట్టి తీరుతామంటూ ప్రజలను రెచ్చగొట్టేలా సభలు, సమావేశాల్లో మాట్లాడుతున్నారు.



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

జీడి బోర్డు ఏర్పాటుకు కృషి

- మార్చి నాటికి రైల్వే ఫ్లైఓవర్ పూర్తి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పలాసలో జీడి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పలాస మండలం కాశీబుగ్గలో రైల్వే ఫ్లైఓవర్, వజ్రపుకొత్తూరు మండలంలో రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించనున్న పూడిలంక వంతెన పున:నిర్మాణ పనులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. పలాస మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీలు వ్యాపార సంస్థలుగా మారాలని, మార్కెట్ కమిటీ సెస్ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. పలాస రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని హామీనిచ్చారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు వారికి ఇంటి స్థలాన్నీ ఇస్తామన్నారు.

రైల్వే వంతెన నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. రైల్వే శాఖ మంత్రిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శిరీష కలిసిన కృషి ఫలితంగా కేంద్ర నిధులతోనే వంతెన పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పూడిలంక వంతెన పనులను పర్యవేక్షించి వచ్చే ఏడాది లోగా పనులు పూర్తి చేసే బాధ్యత స్వయంగా తీసుకుంటానన్నారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో ఈ వంతెన కోసం ఎమ్మెల్యే శిరీష ప్రస్తావించేవారని చెప్పారు.

ఆగస్టు మొదటి వారంలో ఎయిర్‌పోర్టుపై రైతులతో సమావేశం

ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే కార్గో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నష్టపరిహారం ఇప్పుడు ఉన్న దాని కంటే మెరుగ్గా అందిస్తామన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఆగస్టు మొదటి వారంలోనే రైతులతో సమావేశం నిర్వహించి సందేహాలు, అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 1.25 లక్షల స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అనంతరం రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోయిన తొమ్మిది మంది భూ యజమానులకు రూ.22.19 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, చంద్రశేఖర్ త్యాడి, టిడిపి వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ కణితి సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు న్యాయం చేస్తాం

పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పోస్టాఫీసులో నష్టపోయిన ఖాతాదారులకు న్యాయం చేస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు హామీనిచ్చారు. స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. బాధితులతో నేరుగా మాట్లాడేందుకు పోస్టల్ సూపరింటెండెంట్ స్థానిక పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళన వద్దని, అందరికీ న్యాయం చేకూరుతుందన్నారు. ప్రతి పైసా వడ్డీతో సహా చెల్లిస్తామని, ఎటువంటి భయాందోళన చెందవద్దన్నారు. సైబర్ మోసంతో 33 ఖాతాల నుంచి రూ2.78 కోట్లు ఖాళీ చేశారని చెప్పారు. 15 బ్రాంచ్‌ల్లో 35 వేల ఖాతాలను పది రోజులుగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. పోస్టల్ ఖాతాలకు ఫోన్ నంబరు లింక్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం కార్యాలయం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. సైబర్ మోసం కేసును సిబిఐకి అప్పగించామని, నిందితులు ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఖాతాదారుల డబ్బులను వీలైనంత త్వరగా చెల్లిస్తామని భరోసానిచ్చారు. అకౌంట్‌లో వేయడమా, నేరుగా చెల్లించడమో చేస్తామన్నారు. రికవరీతో సంబంధం లేకుండా క్లయిమ్స్ సెటిల్ చేస్తామని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు మాట్లాడుతూ నష్టపోయిన ఖాతాదారులకు డిపాజిట్ల చెల్లింపుపై స్పష్టమైన హామీనివ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో డిపాజిట్లు పోయిన ఖాతాదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, అందరికీ న్యాయం చేకూరుతుందని హామీనిచ్చారు. భవిష్యత్‌లో ఇటువంటి మోసానికి పాల్పడాలంటే భయపడేలా నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కమలహాసన్, చాట్ల లోహిదాస్ రెడ్డి, హైమావతి, ఆర్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

స.హ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ప్రభుత్వ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే చట్టం సక్రమంగా అమలవుతుందని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పి.చంద్రజీవన్ అన్నారు. నగరంలోని జిల్లా పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం దేశంలో అమల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఉద్యోగులకు చట్టంపై పూర్తి అవగాహన కలిగించడం ఎంతైనా అవసరమన్నారు. చట్టం గురించి సమగ్ర అవగాహన లేకపోవడం వల్ల ఉద్యోగులు దరఖాస్తుదారులకు నిర్ణీత వ్యవధిలో సమాచారం అందజేయలేకపోతున్నట్లు చెప్పారు. ఉద్యోగులు చట్టం గురించి తెలుసుకోవడం వల్ల స.హ చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా వారి వ్యక్తిగత సమస్యల పరిష్కారానికీ ఉపయోగించుకోవచ్చని తెలిపారు. స.హ చట్టం శిక్షకులు కొమ్మాజోస్యుల వసంతకుమార్ మాట్లాడుతూ స.హ చట్టం గురించి సమగ్ర పరిజ్ఞానం ఉద్యోగులకు చాలా అవసరమని, అప్పుడే దరఖాస్తులకు సరైన సమాచారం అందజేయగలుగుతారని చెప్పారు. ఈ చట్టంపై పూర్తి పరిజ్ఞానం ఉద్యోగుల్లో లేకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్ ముందు విచారణకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ చట్టం కేవలం 30 సెక్షన్లతో కూడికుని ఉందని, ఇందులో ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగించుకోవాల్సిన సెక్షన్లు 15 వరకు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ అభివృద్ధి అధికారులు డి.సన్యాసి, జి.సన్యాసమ్మ, సహాయాధికారి ఎ.ఎల్.ఎన్ మూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్కాగా పి-4 కార్యక్రమం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో పి-4పై సమగ్ర సర్వే చేయగా ఇప్పటివరకు 75,566 బంగారు కుటుంబాలను, 5,171 మార్గదర్శకులను గుర్తించామన్నారు. ఇందులో 24 వేల కుటుంబాలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు వచ్చారని, వారికి అనుసంధానం చేసినట్లు తెలిపారు. పి-4 కార్యక్రమాన్ని పక్కాగా, చక్కని ప్రణాళికతో అమలు చేస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు ఇందులో భాగస్వామ్యమైనట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రణాళికా విభాగం సారథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేసి నిరుపేద కుటుంబాలను గుర్తించారన్నారు. ఆగస్ట్ 15వ తేదీ లోపు జిల్లాలో ఇంతవరకు గుర్తించిన 75 వేల కుటుంబాలను దత్తత తీసుకొనే కార్యక్రమాన్ని శత శాతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ఈ బృహత్తర కార్యక్రమంలో దాతృత్వం ఉన్న దాతలంతా ముందుకొచ్చి దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు అండగా నిలిచే దాతలకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతాయన్నారు.



శిక్షణ పొందిన డ్రైవర్లతో అమరసింహుడు తదితరులు

మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలి

- ఈ వారంలోనే 22వ బ్యాచ్ శిక్షణ
- జిల్లా ప్రజా రవాణా అధికారి హెచ్.అమరసింహుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్న వారు భవిష్యత్‌లో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఇన్‌ఛార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి హెచ్.అమరసింహుడు అన్నారు. ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్ డ్రైవర్లకు మంగళవారం ఆయన సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారంలో డ్రైవింగ్ స్కూల్‌లో 22వ బ్యాచ్ శిక్షణ మొదలవుతుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 40 రోజుల శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్ రూల్స్ తదితర వాటిపైనా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అకౌంట్స్ అధికారి సి.రాజు, శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

34 కేజీల గంజాయి పట్టివేత

- ఒకరు అరెస్టు
- ద్విచక్ర వాహనం సీజ్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి ముంబైకు గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం కరియాగుడకు చెందిన బిద్యా సాహుని అరెస్టు చేసినట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. నిందితుడి నుంచి 34.320 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కరియాగుడకు చెందిన సంతున్ దాసు రైతుల వద్ద గంజాయిని కొని, దాన్ని ముంబైలో విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు. సంతున్ దాసుకు దగ్గర బంధువైన బిద్యా సాహుకు ముంబైకి వెళ్లి గంజాయి ఇచ్చి వస్తే రూ.పది వేలు ఇస్తాననడంతో అంగీకరించాడు. రెండు లగేజీ బ్యాగుల్లో 18 ప్యాకెట్ల గంజాయితో ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్దకు రాగా అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకుని పరిశీలించగా గంజాయి బయటపడింది. దాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ ముకుందరావు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

ఐవిఎఫ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



నగర పరిధిలోని పలు ఐవిఎఫ్ కేంద్రాలను డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్ మంగళవారం తనిఖీ చేశారు. ఆర్కా ఐ.వి.ఎఫ్ సెంటర్, స్రవంతి ఐ.వి.ఎఫ్ సెంటర్, వైజాగ్ ఐ.వి.ఎఫ్ సెంటర్లలో నమోదవుతున్న ఐవిఎఫ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఐవిఎఫ్ నిబంధనలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయలక్ష్మి ఉన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పోలాకి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు సుధాకరరావు సూచించారు. మండలంలోని డోలలో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పొలాల్లో ఫార్మ్‌పాండ్లను తవ్వాలన్నారు. రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయభాస్కర్, ఎపిఒ రమణారావు, ఇసి మునీంద్ర, టిఎ రజిని, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రం విభజన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాన్ని విభజిస్తామని పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శ్రీకాకుళం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా రాజకీయ పార్టీల సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించటం, ఓటు హక్కు వినియోగం శాతం పెరిగేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. పాదర్శక ఓటర్ల జాబితా తయారీపై సూచనలు, సలహాలు స్వీకరించారు. సమావేశంలో గార తహశీల్దార్ చక్రవర్తి, శ్రీకాకుళం ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జి.కె శ్రీనివాసరావు, టిడిపి నుంచి మాదారపు వెంకటేష్, జనార్ధన, వైసిపి నుంచి అంబటి శ్రీనివాసరావు, బిజెపి నుంచి ఆర్.పురుషోత్తం, జనసేన నుంచి బి.భాస్కరరావు, కాంగ్రెస్ నుంచి ఈశ్వరి పాల్గొన్నారు.



మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తా

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీనిచ్చారు. స్థానిక డిండిబీడి, సిబి రోడ్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారికైన కలెక్టర్ బంగ్లా దారి ఇలా ఉండడం ఆశ్చర్యకరమని అన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి, వారి సమస్యలను, సహకారాలతో పూర్తిగా డ్రైనేజ్ వ్యవస్థపై దృష్టి పెడతానని అన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఎఎంసిని అభివృద్ధి చేస్తాం

చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస

పలాస మార్కెట్ కమిటీని నంబరు వన్ స్థానంలో నిలబెడతానని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎఎంసి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను ఎఎంసి చైర్మన్‌గా పనిచేసి మార్కెట్ యార్డును ఎంతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. అందులో గోదాముల నిర్మాణాన్ని నిర్వహించాను. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కార్మికశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో తాము మొదటిగా రైతుబజారు నిర్మాణం చేపట్టి ప్రజలకు, రైతులకు మేలు చేకూర్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. జీడి రైతులు, వ్యాపారులకు కోల్డ్ స్టోరేజీ ఏడాది కాలంలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం శ్రీనివాసరావును మంత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. మార్కెట్ కమిటీ సెస్ పూర్తిస్థాయిలో వసూలు చేసి మార్కెట్ కమిటీకి అభివృద్ధి, రోడ్లు నిర్మాణాలు చేపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక 11కెవి ఫీడర్లో ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక ఎగువ వీధి, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- కవిటి

సంక్షేమం, అభివృద్ధి కలగలిసి కూటమి పాలన సాగుతోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని రాజపురంలో నూతనంగా నిర్మించిన శ్రీశయన సంఘ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా గ్రామంలో పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని వాకబుచేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలో రైతన్నలకు రైతు భరోసా అందజేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అన్ని నూటికి నూరు శాతం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ పాల్గొన్నారు.

పొందూరు: కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని పిఎసిఎస్ చైర్మన్, యూనిట్ ఇన్‌ఛార్జి వండాన మురళి అన్నారు. పొందూరు మండలంలోని పిల్లలవలస, తోలాపి గ్రామాల్లో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దుంపల సత్యం, వైస్ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపిటిసి మాజీ సభ్యులు అప్పలనాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.



కవిటి : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాం, సిలగాం సింగువలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు చిట్టి జనార్ధన, అంబటి శ్రీనివాసరావు, జి.కృష్ణమూర్తి, బి.చంద్రమౌళి పాల్గొన్నారు.



పొందూరు : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

నందిగాం : నందిగాంలో తొలి అడుగు కార్యక్రమం టిడిపి నాయకులు మదన్ గౌడ్, ఎ.కూర్మారావు, కె.జయరాం, కె.సతీష్, ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి, పి.రామకృష్ణ నిర్వహించారు.

రణస్థలం : మండలంలోని జీరుపాలెంలో కూటమి నాయకులు కలిశెట్టి సూర్యనారాయణ, పిషిణి జగన్నాథంనాయుడు, కనకారావు, భానోజీనాయుడు, అశోక్‌లు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు.

ఇంటర్‌లో పెరిగిన అడ్మిషన్లు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతేడాది 452 కాగా, ఈ ఏడాది 513కి చేరిందని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేయడం వంటి కీలక అంశాలు చేరేందుకు కారణాలు అని అన్నారు. మరోపక్క తల్లిదండ్రుల వద్దకు అధ్యాపకులు వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించడం కూడా సానుకూల ఫలితాలు ఇచ్చిందన్నారని అన్నారు. సైన్స్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ చేయడం, ఖాళీగా ఉన్న పోస్టుల స్థానాల్లో అతిథి అధ్యాపకులను భర్తీ చేయడం వంటి చర్యలు అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు దోహదం చేశాయని చెప్పారు. విశాలమైన లైబ్రరీ, లేబొరేటరీలు, ఆట స్థలం వంటి సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో నాలుగు జనరల్ కోర్సులు, మూడు వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 31 వరకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో ప్రవేశం పొందవచ్చు అని అన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఈ ఏడాది ప్రథమ ప్రవేశాలు నాలుగు శాతం పెరిగినట్లు ప్రిన్సిపాల్ వి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతేదాది 217 మంది ఉంటే, ఈ ఏడాది 229 మంది చేరినట్లు తెలిపారు. అన్ని సబ్జెక్టులు బోధించడానికి పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉన్నారని అన్నారు. ఇంకా ఎవరైనా చెరదలచుకుంటే ఈ నెల 31లోగా దరఖాస్తులు అందచేయాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కొత్తూరు : స్థానిక వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సమస్థ సౌజన్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యానఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ వైద్యాధికారి యిప్పిలి జానకిరామయ్య నేత్రాలను పరీక్షించి 12 మందికి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. అనంతరం వీరిని జెమ్స్‌కు తరలించారు.

ప్రభుత్వాస్పత్రి సందర్శన

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో శానిటేషన్, కో-ఆర్డినేషన్, ఇతర నిర్వహణపరమైన వ్యవహారాలపై సమీక్షించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వాహణ, వైద్య సదుపాయాల లభ్యత వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. సమయపాలన పాటించాలని, శానిటేషన్, వైద్యప్రమాణాల పరిరక్షణ అవసరమని చెప్పారు. సమస్యలు ఉన్న చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే రోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి, డాక్టర్ అలేఖ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా



పలాస : మాట్లాడుతున్న జడ్జి మాధురి

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి- పలాస

సెప్టెంబరు 13న నిర్వహించనన్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. ఈ మేరకు స్థానిక కోర్టులో న్యాయవాదులు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, చిట్ ఫండ్ ఫండ్ కంపెనీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలన్నారు. కక్షిదారులు అందరికీ ముందుగానే ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. రాజీ పడిన సివిల్, క్రిమినల్ కేసులను ముందుగానే తెలియజేయడం వల్ల ఫ్రీ లోక్ అదాలత్ ద్వారా ముందుగానే కేసులు రాజీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి కేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ, ఎజిపి పిండి వెంకటరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన కేసులు పరిష్కరించుకోవాలని జడ్జి ఎం.రోషిణి తెలిపారు. రాజీకి అనుకూలమైన సివిల్, బ్యాంకు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలరించిన 'బుద్ధుడితో నా ప్రయాణం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' అనే నృత్య నాటక ప్రదర్శన అందరినీ అలరించింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మం పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. బుద్ధుని బోధనల సారాంశాన్ని.. డాక్టర్ అంబేద్కర్ జీవితంపై వాటి ప్రభావాన్ని ఈ నాటకంలో చక్కగా చూపించారు. హైదరాబాద్‌కి చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి సభ్యులు బుద్ధుడితో నా ప్రయాణం నత్యనాటకాన్ని ప్రదర్శించగా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, దళిత, ఆదివాసీ సంఘాల జెఎసి శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకి వైద్యులు, తల్లిపిల్లల ఆస్పత్రి అధినేత డాక్టర్ హర్షవల్లి, లలిత ఫౌండేషన్ చైర్మన్ కె.కె.రాజా, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి పిఎస్ఎన్ మూర్తిలు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజని, తల్లిపిల్లల ఆస్పత్రి అధినేతలు డాక్టర్లు విజయ్‌కుమార్, హర్షవల్లి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, తహశీల్దార్ గణపతి, ఐఎఎస్ విశ్రాంత అధికారి రుంకు అప్పారావు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డాక్టర్ హర్షవల్లి



మాట్లాడుతున్న చింతాడ రవి

రైతుల కష్టాలు తీర్చాలి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎరువుల కష్టాల నుంచి రైతులను గట్టెక్కించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు ఒక బస్తా యూరియా కోసం రోజు గంటల తరబడి పనులు మానుకొని రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గ్రామాలకు వస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని విమర్శించారు. టిడిపి నాయకులు ఎరువులను తమ ఇళ్ల వద్ద దాచుకొని బయట అమ్ముకుంటున్నారని, కలెక్టర్ స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, నాయకులు సాకేటి శ్రీనివాసరావు అన్యపు కృష్ణ, ధనుజయరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టి తరలింపు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఎస్.ఎం.పురం సమీపంలో ఉన్న కేశవరావు పంచాయతీలో బుడ్డవాని చెరువు, అదే పంచాయతీలో చీడికాని చెరువుల్లో మట్టి తల్లిపోతుంది. వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టి తరలిపోతుంది. స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో పుష్కలంగా సాగుతున్న వ్యాపార దందా. ఇంత జరుగుతున్నా పంచాయతీ పరిధి లోని విఆర్ఒ నిర్లక్ష్యం వల్లే ఈ మట్టి మాఫియాకి వరంగా మారింది. ఇటీవల ఎస్ఎం పురం పెద్ద చెరువులో మట్టి మాఫియాపై వచ్చిన కథనం మరువకముందే... అర్థరాత్రి యధేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నా... విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ మట్టి మాఫియాకు కాసుల పంట పండింది. సామాన్యులకు మాత్రం మట్టి కరువుతుంది.



చెరువు గట్టును తవ్విన అక్రమార్కులు



అవగాహన కల్పిస్తున్న చాణుక్య కశ్యప్ప

బ్యాంకు సేవలపై అవగాహన

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు అక్షరించడంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి చాణుక్య కశ్యప్ప ప్రస్తుత ఇంజినీరింగ్, ఎంబిఎ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకింగ్ రంగంలో మార్పులు, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడడం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ అల్యూమిన్ రిలేషన్ డాక్టర్ డి.యుగంధర్, కో-ఆర్డినేటర్ సాలీన పూజ, రాంమోహన్ పాల్గొన్నారు.

50 ఏళ్లకే పింఛను హామీ ఏమైంది?

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కవిటి

తాము అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛను ఇస్తామని గొప్పలు చెప్పిన కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఎపవిడు నెరవేరుస్తారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రశ్నించారు. మండలంలోని జగతి, వరక, కుసుంపురం, మాణిక్యపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామస్తులతో మాట్లాడిన ఆమె వైసిపి పథకాలనే కాపీ కొట్టిన కూటమి నాయకులు అమలు చేయడంలో నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భతి ఇస్తామని చెప్పి 2014లో ఓసారి మోసపోయిన నిరుద్యోగులు ఇప్పుడు మళ్లీ బోల్తాపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌లు పూడి వర ప్రసాద్, సావిత్రి పురియా, ఊర్మిళా బిసాయి, దూగాన భద్రాచలం, లలితా సాహు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



కవిటి : మహిళలతో మాట్లాడుతున్న విజయ

ఆమదాలవలస : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఉత్తుత్తి హామీలు ఇచ్చి మోసం చేశారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని రామచంద్రపురం, పురపాలక సంఘంలోని 15వ వార్డు పాతినివారి వీధిలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైసిపి మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మొండేటి కూర్మారావు, చల్ల సింహాచలం, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామ్, పొన్నాడ చిన్నారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పల్లివూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు మద్దిల హరినారాయణ, సర్పంచ్ మామిడి భాస్కరరావు, మండల ఉపాధ్యక్షులు దున్న బాలరాజు, ఎంపిటిసి సభ్యుడు వెంకన్న, సర్పంచ్‌లు చింత హేమారావు, వంక చిరంజీవి, మండల కార్యదర్శి గొరకల విశ్వనాథం, జల్లు ఉషారాణి, లింగరాజు, దుర్యోధన పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచుదాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ మల్లారెడ్డి పద్మనాభరావు అన్నారు. మండలంలోని నడసంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ప్రార్థన సమయానికే హాజరై విద్యార్థుల క్రమశిక్షణ గమనిస్తూ స్ఫూర్తి నిచ్చే కథను తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అందజేసిన ఉపాధ్యాయుల కరదీపికలను అనుసరిస్తూ విద్యాబోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర మిశ్రా విద్యార్థుల హాజరు పెంచే దిశగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని, ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని వివరించారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌తో తల్లిదండ్రుల భాగస్వామ్య సహకారంతో పాఠశాలను, విద్యా ప్రగతిపై దృష్టి పెడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ధర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఇఒ యు.శాంతారావు ఆదేశించారు. మండలంలోని గుండివిల్లిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. అన్నం, సాంబారు, కూరలు ఏవిధంగా ఉన్నాయని పిల్లలతో కలిసి భోజనం చేశారు.



విద్యా సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న ఎంఇఒ పద్మనాభరావు

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దా

ఎంఇఒ రాజేంద్రప్రసాద్



ప్రజాశక్తి- ఆమదాలవలస

తన ఉద్యోగ జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోనే తనకు ఎనలేని సంతృప్తిని ఇచ్చిందని మండల విద్యాశాఖ అధికారి జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. తన దగ్గర విద్యను అభ్యసించిన విద్యార్థులు సగానికి సగం వైద్య వృత్తిలో స్థిరపడ్డారని అన్నారు. అందులో సిపాన రమేష్, సత్తారు కిషోర్, బి.వి.ఎస్.ప్రకాష్ తదితరులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే చాలామంది విదేశాల్లో స్థిరపడ్డారని, ఇది తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నదని అన్నారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా రెండుసార్లు, బెస్ట్ ఎప్రిసియేట్ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా మూడుసార్లు, నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకోవడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

విద్యాభ్యాసం

ప్రాథమిక విద్య సంతబొమ్మాళి మండలం, 6,7 తరగతులు సంతకవిటి మండలం మందరాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, 8,9 తరగతులు సోంపేట గవర్నమెంట్ హైస్కూల్, పదో తరగతి ఆమదాలవలస గవర్నమెంట్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ ఆమదాలవలస జూనియర్ కాలేజీలో, డిగ్రీ శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో, ఎంఎ ఇంగ్లీష్ ఆంధ్రా యూనివర్సిటీ, బిఇడి విజయనగరం మహారాజా కాలేజ్ విద్యను అభ్యసించారు.

ఉద్యోగ జీవితం

1989లో ఎస్‌జిటి పరీక్షల్లో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించారు. మొట్టమొదటిగా పొందూరు మండలం పిల్లలవలస పాఠశాలలో తన ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1992లో ఎపిపిఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. గవర్నమెంట్ హైస్కూల్ ఆమదాలవలసలో 2005 వరకు విధులు నిర్వర్తించారు. అనంతరం గవర్నమెంట్ హైస్కూల్ శ్రీకాకుళానికి బదిలీపై వెళ్లారు. ప్రధానోపాధ్యాయులుగా పలాసలో నియమితులై అక్కడి నుంచి మళ్లీ శ్రీకాకుళానికి బదిలీపై వచ్చారు. శ్రీకాకుళం నుంచి ప్రియాగ్రహారం గవర్నమెంట్ హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. మండల విద్యాశాఖ అధికారిగా 3-7-2023న ఆమదాలవలసకు ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈనెల 31న ఇక్కడ ఉద్యోగ విరమణ పొందనున్నారు.

నిర్వర్తించిన బాధ్యతలు

స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, రిసోర్స్ పర్సన్‌గా టీచ్ టూల్ స్టెప్ ఆఫ్ కోర్సు డైరెక్టర్‌గా, పదో తరగతి స్టడీ మెటీరియల్ తయారీకి ఎస్ఇఆర్‌డి.సెక్రెటరీ డిసిఇబి తదితర బాధ్యతలు నిర్వర్తించారు. పదో తరగతికి సంబంధించి విద్యా ప్రమాణాల యాక్షన్ ప్లాన్ 200 మోడల్ పేపర్ ప్రైమరీలో మంచి ప్రమాణాలు నెలకొల్పేందుకు కృషి చేశారు. 125 మంది పిల్లలు ఉన్న ప్రియాగ్రహారం హైస్కూల్‌లో అప్పట్లో రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. మండలంలోని దూసి పాఠశాలలో విద్యార్థులు తగ్గిపోయి పాఠశాల అంతరించిపోతున్న తరుణంలో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వవైభవం తీసుకువచ్చారు.



పహారా కాస్తున్న పోలీసులు

పోలీసుల పహారా

లావేరు: లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జెడ్‌పి పాఠశాల పరిసర సమీపంలో రోజూ ప్రారంభం, ముగింపు సమయాల్లో పోలీసులు పహరా కాస్తున్నారు. ఇటీవల ఆకతాయిలు కళాశాల, పాఠశాల సమయంలో విద్యార్థినులను ఆకతాయిలు అసభ్యంగా ప్రవరిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎస్ఐ జి.లక్ష్మణరావు సిబ్బందితో వెళ్లి సంకల్పం పేరుతో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. పనిలో పనిగా బహిరంగంగా రహదారిపై కొట్టుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వ్యక్తికి జైలు

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడలో గతేడాది జరిగిన కొట్లాట కేసులో వ్యక్తికి రెండు నెలలు జైలు శిక్ష కోటబొమ్మాళి జడ్జి విధించినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చెన్నూరు వెంకట్‌రాజుపై రోకళ్ల యర్రన్న దాడి చేయడంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కేసును విచారించిన జడ్జి ముద్దాయికి జైలు శిక్ష విధించారని తెలిపారు.



స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని నౌపడ మేజర్ పంచాయతీలో వీధి కుక్కలు స్వైరవ్యవహారం చేస్తున్నాయి. మంగళవారం గాంధీ రోడ్డు వీధిలో సుగ్గు అప్పలరాజు, పొందర వీరాస్వామిలపై దాడి చేసి గాయపరిచాయి. పంచాయతీల్లోని పలు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నౌపడ పిహెచ్‌సిలో మూడు రోజులు నాలుగు కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. నెల రోజుల్లో 10 కేసులు చికిత్స పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి. వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

టెక్కలి: వివిధ కళాశాలల్లో, ఉన్నత విద్యాసంస్థల్లో చదువు తున్న విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి నమోదు చేయించాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు నమోదులో అర్హత కలిగి ఉన్న వారిని ఓటర్లుగా చేర్పించేందుకు ఆగస్టు మొదటి, రెండు వారాల్లో చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ఆయా కళాశాలల యాజమాన్యాల ప్రిన్సిపాళ్లకు ఇందుకు సంబంధించిన ఫారాలని అందించి నమోదు చేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టెక్కలి, సంత బొమ్మాళి మండలాల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు, జీరో భీమారావు, బిజెపి నుంచి రాంజీ, దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

పొందూరు: పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలో పాడైన తాగునీటి పైప్‌లైన్‌కు మంగళవారం ఇఒ కింతలి మోహన్‌బాబు ఆధ్వర్యాన మరమ్మతులను చేపట్టారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఇఒ మోహన్‌బాబు

తాగునీటి పైప్‌లైన్ పాడైపోవడంతో కొద్దిరోజులుగా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో లైదాం వద్ద గల రెల్లిగెడ్డలోని ఈ తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం రెల్లిగెడ్డలో నీరు ఉండడంతో మరమ్మతులకు కొద్దిగా ఇబ్బందులు నెలకొన్నాయని, త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేసి తాగునీరును సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఆమదాలవలస : పురపాలకు సంఘంలోని ఏడో వార్డు చింతాడ ప్రాథమిక పాఠశాల హైస్కూల్‌లోని విద్యార్థినులకు శక్తి టీం ఇన్‌ఛార్జి వాసుదేవరావు మంగళవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలి, బాధితులకు పోలీసుల ద్వారా ఎలాంటి రక్షణ లభిస్తుంది వంటి అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. పాఠశాల బాలికలకు ప్రత్యేకంగా కరాటే తరగతులు నిర్వహించి స్వీయ రక్షణపై శిక్షణ ఇచ్చారు. బాల్యవివాహాలు, అదృశ్యర్ కేసుల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ జి.మోహనరావు, ఉమెన్ పిసి ఉషారాణి, లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నరసన్నపేట: నరసన్నపేట పంచాయతీ జర్నలిస్టు కాలనీలో పంచాయతీ నిధులతో సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు గొద్దు చిట్టిబాబు, నేతింటి విశ్వేశ్వరరావు, ఊన్న వెంకటేశ్వరరావు, బలివాడ చిట్టిపంతులు, పుచ్చల కల్యాన్రప్రసాద్, పీశకృష్ణ, కింజరావు చిన్నవాడు, బోయిన సతీష్, గొండు సత్యం, సదాశివుని కృష్ణ, కాంట్రాక్టర్ నేతింటి సింహాచలం పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు


చెక్కును అందిస్తున్న విప్ అశోక్

ఆపదలో ఆదుకునేందుకే సహాయనిధి

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. నియోజకవర్గంలోని ఆరుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.6,76,616 లక్షలకు సంబంధించిన చెక్కులను మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న బండారు అమ్ములు, బుడ్డెపు మోహనరావు, కన్ను చూడామణి, గవలాపు సునీత, నెయ్యిల దుదిస్టి, లండ శంకర్ మాట్లాడుతూ అనారోగ్యానికి గురై అప్పులు పాలైన తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి చేయూత అందించిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, ఆరింగి మధు, బెందాళం తిరుమల కుమార్, మాదిన రామారావు, కొర్రాయి వాసుదేవ్, పత్రి తవిటయ్య, ఆసి లీలారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణ

జీతాలందక అవస్థలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మినిమం టైం స్కేల్‌తో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కుటుంబాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ అధ్యక్షులు పైడి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. మే నెలలో ఎలాగూ జీతం ఇవ్వలేదని అన్నారు. కనీసం జూన్, జూలై నెలలకైనా జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో చాలా మంది ఎంటియస్ ఉపాధ్యాయులకు దూర ప్రాంతాలకు బదిలీ చేశారని అన్నారు. జీతాలు లేక బస్సు ఛార్జీలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉపాధ్యాయులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవిత చివరి దశలో ఉద్యోగంలో చేరినందున పన్నెండు నెలల జీతం చెల్లిస్తూ అరవై రెండు సంవత్సరాల వరకు సర్వీసు పొడిగించాలని, పెన్షన్ అవకాశం కల్పించాలని కోరారు.


పలాస : కూపన్లను పంపిణీ చేస్తున్న ఎఒ పోలారావు

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి- పలాస

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా కూపన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎఒ పోలారావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, బంటు కొత్తూరు, టెక్కలిపట్నం తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. అనంతరం రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 140 టన్నులు యూరియా, వంద టన్నులు డిఎపి రైతు సేవా కేంద్రాలకు వచ్చి చేరాయని చెప్పారు. ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు లేకుండా కూపన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు శిష్టి మురళీకృష్ణ, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని లొద్దపుట్టి, మండపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ అజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల కోసం కూపన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎలు సోనియా సునీత పాల్గొనానరు.

పోలాకి : రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో కనీసం ఒక విడత ఎరువుగా నానో యూరియా వాడాలని ఎఒ చిరంజీవి సూచించారు. మండలంలోని రహిమాన్‌పురం పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో 445 యూరియా బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 300 టన్నులు యూరియా వచ్చిందని తెలిపారు. కొత్తరేవు, బొద్దాం, అంపలాం, బెలమర, కోడూరు పంచాయతీలకు త్వరలో వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

ఎక్కడ పని చేసినా విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన డిటి లక్ష్మీనారాయణ, ఎఎస్ఒ జోగారావు, సివిల్ సప్లయి డిటి మురళీతో పాటు 12 మంది విలేజ్ సర్వేయర్లను తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి గిరి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి సునంద, విఆర్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ల శ్రావణ్‌కుమార్, ఆర్ఐ ప్రసాదరావు, పాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు...

ఇచ్ఛాపురం : మండలంలోని మందపల్లి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు జాడు ప్రకాష్, పద్మనాభం, సత్యమయ్య, రవికుమార్, నాగేశ్వరరావు, కమలకుమారి, రాణి గౌడో, కమలయ్య, సాజన్, బి.కె.బెహరా, మీనాక్షి, బృందబతిలు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు టి.వి.భార్గవి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శాలిహుండం వాసంతి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, ఉమాశంకర్, కవిరాజు, మురళి, ఎస్.స్వాతి, అమూల్య, మహేశ్వరి, రమేష్, ఐ.లలిత, బి.స్వాతి, ఓ.లలిత, భీమరావు, సంజూ బెహరా, నీలవేణి, సబితా పాల్గొన్నారు.


పలాస : బదిలీ ఉద్యోగులతో తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి

ఆధునిక విజ్ఞాన కేంద్రాలుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఆధునిక విద్యా విజ్ఞాన కేంద్రాలుగా సర్కారు బడులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నారని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్పష్టం చేశారు. పిఎంశ్రీ పథకానికి ఎంపికైన కొండములగాం ఎపి మోడల్ స్కూల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ వినూత్న ఆలోచనలతో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020లో భాగంగా దేశంలో అన్ని పాఠశాలలను ఆధునిక విద్యా కేంద్రాలుగా మార్చే సంకల్పంలో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అందులో భాగంగానే పిఎంశ్రీ పథకం ఆవిర్భావించిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బుడుమూరు దుర్గారావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి, ఎంఇఒలు అజ్జాడ త్రినాథరావు, లావణ్య, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, దన్నాన సత్తిబాబు, దన్నాన స్వామినాయుడు, దన్నాన చిరంజీవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ

నీళ్ల ట్యాంకుల నిర్మాణానికి చర్యలు

పలాస : గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలను గుర్తించి తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ డిఇ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సున్నాడ, కేదారిపురం, అమలకుడియా, తర్లకోట గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్మాణాలకు మంగళవారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో రూ.39.60 లక్షల వ్యయంతో నీటి ట్యాంకులు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తక్కువ సమయంలో జల జీవన్ మిషన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆయనతో పాటు ఎఇ దుర్యోధన, టిడిపి నాయకులు కుమ్మరి సింహాద్రి ఉన్నారు.


వివేకానంద మాస్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వివేకానంద్‌కు సన్మానం

సంతబొమ్మాళి : సిబిఎం పాఠశాల నిర్వహణ, కొనసాగించేందుకు వివేకానంద మాస్టారు కృషి చేశారని ఎంఇఒ చిన్నవాడు అన్నారు. మండలంలోని జగన్నాథపురం-ఎన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు వేకానంద శతపతి పదవీ విరమణ సభ మంగళవారం నిర్వహించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తాను పనిచేసిన నౌపడ, జగన్నాథపురం పాఠశాలల్లో విద్యార్థులు అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. అనంతరం వివేకానంద దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయకృష్ణ, గ్రామస్తులు పీరుపల్లి రాజశేఖర్, రవికుమార్‌రెడ్డి, సుగ్గు శాంతిస్వరూప రెడ్డి, వాడ్రేవు కృష్ణారావు, ఎండయ్య, నాగిరెడ్డి, రవి, రాజు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు శంకుస్థాపన

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీలో చొక్కరవానిపేట, సూరాడవానిపేట గ్రామాల్లో తాగునీటి బోర్ల ఏర్పాటుకు సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలకు సురక్షిత తాగుచినీరు అందించేందుకు, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాడ దాసురాజు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గంట లోకేష్, చొక్కర గోపి, చొక్కర నరసింహులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి పంటలో సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ సిడిఎఫ్ చేపేన సురేష్ అన్నారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లివాడ గ్రామాల్లో రైతులతో లైన్ షోయింగ్ విధానంలో వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా వరి నాట్లు వేసేటప్పుడు నారు చిగుళ్లు తుంచి, లైన్ షోయింగ్ పద్ధతిలో వేసుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో రైతులతో ప్రధానంగా వరి పంటలో సస్యరక్షణ పద్ధతులను చేపట్టేలా వేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా వరి నారు చిగుళ్లు తుంచి నాటించామన్నారు. ఈ విధంగా చేయడం వల్ల వరి నారు మొక్కల చిగుళ్లలో ఉండే రసం పీల్చే పురుగుల గుడ్లు సముదాయాలను నాశనం చేయవచ్చునని పేర్కొన్నారు. తద్వారా పంటకు పురుగుల ఉధృతిని తగ్గించవచ్చునని తెలిపారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలియపరుస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తామన్నారు.


వరి నారు చిగుళ్లను తుంచుతున్న రైతులు

పలువురు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మా సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడకు చెంది దండుపాటి నారాయణమ్మకు మంగళవారం రూ.11 వేలు ఆర్థికసాయం సంస్థ తరుపున అందజేశారు. ఆమె గత కొంతకాలంగా గుండె, ఊపిరితిత్తులు సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారని తెలిపారు. ఆమె భర్త దినసరి కూలీ కావడంతో సంస్థ సభ్యులు ఆర్థికసాయం అందించిందని చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చింత మోహన్, మండల మహేష్, ఈశ్వర్, లక్ష్మణ్, నీలయ్య, శ్యామ్, దండుపాటి పవన్ కుమార్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో బూరగాపు రాము, పార్వతిల కుమార్తె మౌనిక వివాహ సందర్భంగా యువతరం సేవా సమితి సభ్యులు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, సభ్యులు గోరకల సునీల్, అన్నపు లక్ష్మణరావు, గున్న వెంకటరమణ, కోడి నిహల్ పాల్గొన్నారు.


సన్మాన పత్రం అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

చదువుతోనే భవిష్యత్

పలాస : విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై దృష్టి సారించాలని, చదువే భవిష్యత్‌లో మార్గదర్శకంగా నిలుస్తుందని సత్యసాయి విద్యా సంస్థ చైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో మంగళవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కొంచాడ అభిషా గాంధీకి నగదు బహుమతి, బాల మేధవి బిరుదుతో పాటు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి విద్యా విహార్‌లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ఏటా శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సుసరాపు నారాయణమ్మ, ధర్మపురి సీతారామశర్మ (బోసుబాబు), వైస్ ప్రెసిడెంట్ తాళాసు శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, మురళి, హేమంత్, జామి శ్రీను, మద్ది కామేశ్వరరావు, తాళాసు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య సేవలు

ఆమదాలవలస: రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజా వైద్యశాల వైద్యులు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ చాపర సుధాకర్ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పూజిత పాల్గొని వైద్య సేవలు అందించారు. ఇరువురు వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ పై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ చాపల సుధాకర్‌ను రోటరీ క్లబ్ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చాపర విజయలక్ష్మి, అసిస్టెంట్ గవర్నర్ ఆర్‌టిఎన్ నరసింహారావు, అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌టిఎన్ వి.టి.చౌదరి, జె.కె.వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు టి.మదన్‌కుమార్, ఎస్.రవికుమార్, కె.సంజీవరావు, ప్రిన్సిపాల్ ఆర్‌టిఎస్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.


చిన్నారులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది


నూతన కార్యవర్గంతో ఎంపిడిఒ జయంతి ప్రసాద్

కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షునిగా శ్రీనివాస్

సంతబొమ్మాళి : పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సంఘం మండల అధ్యక్షుడిగా దంప శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జయంతి ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యవర్గంలో ఉపాధ్యక్షునిగా ఉప్పాడ ఉమాపతి, సాధారణ కార్యదర్శిగా బి.రమేష్, ఉప కార్యదర్శిగా కె.మౌనిక, కోశాధికారిగా మోహనరావు, గౌరవాధ్యక్షునిగా కె.పి.సిహెచ్.బి.వి.రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కె.జ్యోతి, ఆర్.రామ్‌కుమార్, పి.చంద్రబాబు నాయుడు, ఎ.మధుకేశ్వర్, కె.రాజేంద్రప్రసాద్, బి.కేశవరావు, ఎం.గోవిందరావు, చంద్రమౌళి, ఎం.నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

పి-4పై గ్రామసభ

మెళియాపుట్టి : ప్రభుత్వం పేదలకు అండగా ఉండేందుకే బంగారు కుటుంబాలు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండలంలోని మర్రిపాడు-సి సచివాలయంలో మంగళవారం బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామసభ నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పేదలను గుర్తించి అటువంటి కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలన్నారు. విద్య, వైద్య రూపంలో సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, మాజీ సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.


నిర్మిస్తున్న ఇల్లు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి: మేజరు పంచాయతీ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా, దౌర్జన్యంగా ఎటువంటి పత్రాలు లేకుండా ఇల్లు నిర్మాణం చేపడుతున్నారని, దీనిపై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన డి.రాము, బి.కృష్ణారావు, బి.శ్రీనులు కోరారు. మంగళవారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ స్థలం రోడ్డు మలుపు వద్ద ఉండటం వల్ల ఇక్కడ ఇల్లు నిర్మిస్తే ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవించే అకాశాలు ఉన్నాయని అన్నారు.